వరి చేలలో కాలిబాటలతో ఎంతో మేలు

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

యలమంచిలి: ప్రస్తుతం వరి ఊడ్పులు వేగంగా సాగుతున్నాయి. వరి చేను ఊడ్చిన తరువాత పొలంలో ప్రతి రెండు మీటర్లకు కాలిబాట వేయడం వల్ల రైతులకు అధిక ప్రయోజనం ఉంటుందని వ్యవసాయాధికారులు చెప్తున్నారు. పైరు వేరు భాగానికి విస్తారంగా గాలి, సూర్యరశ్మి తగలడం, చీడ, పీడల సమస్య తగ్గడం, ఎరువులు, పురుగు మందులు చల్లే సమయంలో దారి సమస్య తగ్గడంతో పాటు ప్రతి ఎకరాకు మూడు, నాలుగు బస్తాలు అదనంగా పండి రైతులు లాభం పొందవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. గతంలో చాలామంది రైతులు కాలిబాటలు వేయడం అదనపు ఖర్చుగా భావించి ఆసక్తి కనబరిచేవారు కాదు. వ్యవసాయాధికారులు కాలిబాటల ప్రయోజనాన్ని రైతులకు విస్తృతంగా వివరించడంతో ఇప్పుడు రైతులంతా కాలిబాటలు వేస్తున్నారు.

కాలిబాటలు వేసే విధానం

కాలిబాటలు వేసే సమయంలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. ప్లాస్టిక్ లేదా డొక్కతాడు తీసుకుని చేను గట్టు అవతలి వైపు నుంచి ఇవతలి వైపు వరకు బాగా సాగదీసి కట్టాలి. తాడు వెంబడి 12 సెంటీమీటర్లు వెడల్పున వరి నాట్లు తొలగించి పక్కనే పలుచగా ఉన్న ప్రదేశంలో నాటుకోవాలి. వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తే విత్తనాలు చల్లిన తరువాత 15 నుంచి 20 రోజుల వ్యవధిలో కాలిబాటలు వేసుకోవాలి.



శిరగాలపల్లిలో కాలిబాట వేసిన వరి చేను (ఫైల్)

కాలిబాటలతో ప్రయోజనాలు

- కాలిబాట వేయడం వల్ల పైరు మొదళ్లకు గాలి, వెలుతురు, సూర్య రశ్మి విస్తారంగా తగులుతుంది. దీంతో పైరు ఆరోగ్యంగా ఎదుగుతుంది.
- చీడపీడల బెడద కొంతవరకు తగ్గుతుంది. కాలిబాట మార్గంలో వెళ్లి కలుపు తొలగించడానికి, మందులు చల్లడానికి వీలు కలుగుతుంది.
- తెగుళ్లను సులభంగా గుర్తించడానికి, సస్యరక్షణ చర్యలు తీసుకోవడానికి ఎలుకలను నివారణకు వీలవుతుంది.
- తుఫాన్‌లు, భారీ వర్షాలు వంటి ప్రకృతి విపత్తులు ఏర్పడిన సమయంలో పైరులో కిరణజన్య సంయోగ క్రియ సమర్థవంతంగా జరిగి దిగుబడి తగ్గకుండా ఉంటుంది.
- పైరులో చీడ పీడల ఉధృతిని దగ్గరగా గమనించి, దానికి అనుగుణంగా సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవడానికి వీలవుతుంది.

కాలిబాటలతో అధిక దిగుబడి



ఒక ఎకరం పొలంలో కాలిబాటలు వేయడానికి సుమారు రూ.800 ఖర్చవుతుంది. కానీ కాలిబాటలు వేయడం వలన నాలుగు బస్తాల వరకు అధిక దిగుబడి రావడమే కాకుండా పంట కాలంలో చేను మొత్తం తిరగడానికి అనువుగా ఉంటుంది. దీనిపై మా సిబ్బందితో రైతులకు అవగాహన కల్పించడంతో ఇప్పుడు రైతులంతా కాలిబాటలు వేస్తున్నారు.

– దుంగా బాల త్రిపుర సుందరి, యలమంచిలి మండల వ్యవసాయాధికారి

గణపతి ఉత్సవాల అనుమతులకు వెబ్‌సైట్



కోలా రజనీకుమార్

పాలకొల్లు సెంట్రల్: వినాయకచవితి ఉత్సవాల నిర్వాహకులు మండపాల ఏర్పాట్లలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని మండపాల నిర్వహాకులకు పట్టణ సీఐ కె.రజనీకుమార్ తెలిపారు. గురువారం రజనీకుమార్ విలేకరులతో మాట్లాడుతూ పోలీసు ఉన్నతాధికారుల అనుమతుల ప్రకారం గణపతి ఉత్సవాల ఏర్పాట్లకు ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేశారన్నారు. మండపం నిర్వాహకులు ఈ వెబ్‌సైట్ ద్వారా సింగిల్ విండో విధానంలో ఆన్‌లైన్‌లో అనుమతులు పొందవచ్చన్నారు. అనుమతులు పొందడానికి ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఆన్‌లైన దరఖాస్తు చేసుకున్న తరువాత పాలకొల్లు పట్టణ పోలీసు అధికారులు మండపం స్థలాన్ని తనిఖీ చేసి నిబంధనలు అనుగుణంగా ఉంటే క్యూఆర్ కోడ్‌తో కూడిన నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) జారీ చేస్తారన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే గణపతి ఉత్సవాలకు మాత్రమే ఈ అనుమతులు తప్పనిసరి అని అన్నారు. ఈ ఆన్‌లైన్ విధానం ఉత్సవాలను సురక్షితంగా, పారదర్శకంగా నిర్వహించడానికి రూపొందించారన్నారు. మైక్ పర్మిషన్ చట్టపరంగా మాత్రమే మంజూరు చేస్తామన్నారు. శబ్ద కాలుష్యం రూల్స్ 2000 ప్రకారం రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకూ ఎటువంటి లౌడ్ స్పీకర్లు ఉపయోగించరాదన్నారు. ప్రతి ప్రాంతానికి నిర్ణయించిన శబ్ద పరిమితులు తప్పనిసరిగా పాటించాలన్నారు. శోభాయాత్రలు, నిమజ్జనాలు జరిగే సమయాల్లో విద్యుత్ వైర్లు అడ్డు లేకుండా చూసుకోవాలని సూచించారు. నిర్దేశించిన మార్గాల్లో ఉత్సవాల ఊరేగింపు నిర్వహించాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకుని శాంతియుతంగా, భద్రతతో, భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు రైల్వే గేట్ 11 కేవీ లైన్ మీద ఉన్న చెట్లు కొమ్మలు తొలగిస్తున్న కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని నరసాపురం డివిజన్ ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.మధుకుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాజీవ్ నగర్, శ్రీనివాస డీలక్స్, సలాది వారి తోట, సాయిబాబా గుడి ఏరియా, జోగయ్య కాలనీ, గవర్నమెంట్ హాస్పిటల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. అదే విధంగా పాలకొల్లు రూరల్ మండలంలోని అరట్లకట్ల, పొలమూరు, వెంకటాపురం, దిగమర్రు, వరిధనం, పెదమామిడిపల్లి గ్రామలలోని విద్యుత్ సర్వీసులకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి



ఆచంట కచేరీ సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



పెనుగొండలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



బ్రాహ్మణచెరువు సెంటర్‌లో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు

పెనుగొండ: అరకొర వేతనాలతో ఎక్కువ పని చేస్తున్న అంగన్‌వాడీలకు ఫేస్ యాప్‌ని వెంటనే రద్దు చేయాలని కౌలు రైతులు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కేతా గోపాలం అన్నారు. ఫేస్ యాప్ రద్దు చేయాలని కోరుతూ గురువారం మండలలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు నల్ల దుస్తులు ధరించి బ్లాక్ డే నిర్వహించి, స్థానిక రామేశ్వర స్వామి సత్రం నుంచి కచేరి సెంటర్ వరకు ర్యాలీతో ఆచంట కచేరి సెంటరుకు చేరుకొని మానవహారం నిర్వహించారు. ఇప్పటికే వేతనానికి మించి పని చేస్తున్న అంగన్‌వాడీలను యాప్ కష్టాలు వెంటాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన యాప్‌లతో పని చేయవలసిందే అంటూ అంగన్‌వాడీలపై అధికారులు తీవ్ర ఒత్తిడి తీసుకురావడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి.మోహన్ రావు, తలపూరి బుల్లబ్బాయి, బండి రంగారావు, సిఐటియు జిల్లా నాయకురాలు వైట్ల ఉషారాణి, మైలే విజయలక్ష్మి, గుత్తుల శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో

అఖిలభారత అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ పిలుపు మేరకు గురువారం పెనుగొండ మండలం కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పెనుమంట్ర ప్రాజెక్టు లీడర్ కానూరి తులసి మాట్లాడుతూ లబ్ధిదారులను తగ్గించే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని, కనీస వేతనాలు రూ.26000 అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఎస్.వెంకటేశ్వరరావు, కేయూఎం భవాని, పీడీ పరమేశ్వరి, కె.నాగలక్ష్మి, ఎల్.ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

పెనుమంట్ర: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అంగన్‌వాడీలకు వర్తింపజేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి కోడి శ్రీనివాస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం బ్రాహ్మణ చెరువు సెంటర్‌లో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్స్, వర్కర్స్‌కు కనీస వేతనాలు అమలు చేస్తూ, అందరికీ కొత్త స్మార్ట్ ఫోన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కూసంపూడి సుబ్బరాజు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకు వచ్చిన ఫేస్ యాప్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ముందుగా రామచిలు సెంటర్లో నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.సాయిమహాలక్ష్మి, మంగతయారు, నేతల నాగమణి, అనూష సరస్వతి, సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి

పెనుగొండ: ఇటీవల భారీ వర్షాలు కారణంగా వరి చేలు వర్షాలకు మునిగి నష్టపోయిన చిన్న సన్నకారు, కౌలు రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ నాయకుడు ఎస్.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం పెనుగొండ, చెరుకువాడల్లో మునిగిన వరిచేలను పరిశీలించారు. గత రెండు నెలల్లో రైతులు ఎకరానికి రూ.18000 పెట్టుబడి పెట్టారన్నారు. పెట్టిన పెట్టుబడి మొత్తం వర్షపాలయిందన్నారు. పెనుగొండ, చెరుకువాడ ప్రాంతంలో సుమారు 10 ఎకరాలు మునిగి ఎందుకు పనికి రాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజులుగా రైతులు ఆయిల్ ఇంజిన్లతో వర్షపు నీటిని తోడుకుంటున్నారన్నారు. తక్షణం అధికారులు నష్టపోయిన పంటను అంచనా వేసి ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం వచ్చే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన రైతాంగానికి 20 వేల రూపాయలు ఇవ్వాలని కోరారు. ఎరువులు, పురుగు మందులు సబ్సిడీపై అందజేయాలని డిమాండ్ చేశారు. బాధిత రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకుని ఆదుకోవాలని అన్నారు.



చెరుకువాడలో కుళ్లిపోయిన వరి నాట్లను చూపుతున్న వెంకటేశ్వరరావు

క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

పాలకొల్లు సెంట్రల్: ప్రతిఒక్కరూ క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ వట్టూరి రమేష్ అన్నారు. గురువారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో క్షయ వ్యాధిపై అవగాహనా సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ క్షయ వ్యాధి చాలా ప్రాచీన కాలం నుంచి ఉందని అన్నారు. ఇటీవల కాలంలో ఎక్కువగా విస్తరిస్తుందని తెలిపారు. దీనిని నివారించాలంటే ప్రతిఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ కనభరచాలని అన్నారు. క్షయ వ్యాధి వివిధ రకాల్లో ఉంటుందన్నారు. ఊపిరితిత్తులు, ఉదర భాగం, మెదడుకు, ఎముకలకు సంబంధించి పలు రకాలుగా సంభవిస్తుందన్నారు. మన పరిసరాల్లో ఎవరైనా ఎక్కువగా దగ్గుతో బాధపడుతుంటే వారిని దగ్గరలో ఉన్న వైద్య కేంద్రానికి తీసుకువెళ్లి వైద్య పరీక్షలు చేయించాలన్నారు. ఈ వైద్య పరీక్షలు ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తుందన్నారు. వ్యాధి తీవ్రతను బట్టి మందులు కూడా ఉచితంగా అందజేస్తుందన్నారు. ఈ వ్యాధికి గురైన వారికి బలమైన ఆహారం అందించాలన్నారు. వ్యాధి తీవ్రతను బట్టి తగ్గించడానికి ఆరు నెలలు లేదా తొమ్మిది నెలలు సమయం పడుతుందన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఎం.రామకృష్ణ



మాట్లాడుతున్న డాక్టర్ రమేష్

కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి, జేసీఐ ప్రెసిడెంట్ వెంకట్, సెక్రటరీ మౌనిక, ట్రెజరర్ ఈశ్వర్, అధ్యాపకులు నోబుల్‌రాజు, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ఎం కళాశాలలో..

యలమంచిలి: మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ వెల్ఫేర్ ఆదేశాల మేరకు గురువారం పాలకొల్లు అద్దేపల్లి సత్యనారాయణమూర్తి (ఏఎస్ఎన్ఎం) ప్రభుత్వ కళాశాల విద్యార్థులు స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కళాశాలలోని హెల్త్ కేర్ సెంటర్, ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 సంయుక్త ఆధ్వర్యంలో అడవిపాలెం, యాళ్లవానిగరువు, ఎంఎంకెఎన్ హైస్కూల్ కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా విద్యార్థులు, అధ్యాపకులు కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా దోమకాటు వలన వచ్చే ప్రాణాంతక వ్యాధులు, దోమలు రాకుండా పరిసరాలను ఏ విధంగా శుభ్రంగా ఉంచుకోవాలి వంటి అంశాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ ఎం.రామకృష్ణ క్షయవ్యాధి (టీబీ) వ్యాధి లక్షణాలు, నివారణ పద్ధతులు, చికిత్స గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వి.విజయలక్ష్మి, హెల్త్ కేర్ కన్వీనర్ టీ జోత్స్నశ్రీ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

పాలకొల్లు సెంట్రల్: రైతులు ప్రకృతి వ్యవసాయంపై పట్టు పెంచుకునేలా వ్యవసాయ శాఖ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా వ్యవసాయ శాఖ సంచాలకులు వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం పాలకొల్లు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పోడూరు, ఆచంట మండలాల గ్రామస్థాయి, ఉద్యానవన సహాయకుల శిక్షణా శిబిరం మూడో రోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పంట వైవిధ్యత ఈ డెల్టా ఏరియాలో ఎలా చేయగలమో? సలహాలు సూచనలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిఒక్కరూ నలుగురు రైతులను దత్తత తీసుకుని వారితో ప్రకృతి వ్యవసాయం చేయించాలని వివరించారు. జిల్లాను ఏ గ్రేడ్ మోడల్ చేయించాలని అన్నారు. అనంతరం ఈ-పంట, పంట కోత ప్రయోగం గురించి వివరించారు. కార్యక్రమంలో పాలకొల్లు వ్యవసాయ సహాయ సంచాలకులు మురళీకృష్ణ, డివిజన్ ఇన్‌చార్జ్ అప్పారావు, ఎంఎంటీఎల్ మురళీకృష్ణ, ఏఓలు రాజశేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న సిబ్బందితో వ్యవసాయాధికారులు

రేపు బీఆర్‌ఎంవీ పాఠశాలలో పద్య పఠన పోటీలు

పాలకొల్లు సెంట్రల్: తెలుగు బాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పద్య పఠన పోటీలు నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎంవీ మునిసిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.ఝాన్సీ లక్ష్మీబాయి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. శనివారం గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా గురు సహస్రవధాని బ్రహ్మశ్రీ కడిమెళ్ల వరప్రసాద్ రచించిన శిష్య శతకంపై పట్టణ స్థాయిలో పద్య పఠన పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని, అనంతరం విజేతలకు బహుమతులు అందిస్తారని స్పష్టం చేశారు. ఈ పోటీలు జూనియర్ విభాగంలో 6,7 తరగతులు, సీనియర్ విభాగంలో 8,9 తరగతులకు పఠన అంశం, శిష్య శతకం, సబ్ జూనియర్స్ 4,5 తరగతుల విద్యార్థులకు (బిఆర్ఎంవి క్లస్టర్ ప్రాథమిక పాఠశాలకు మాత్రమే) అంశం, వేమన శతకం నిర్వహించనున్నట్లు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

పాలకొల్లు సెంట్రల్: ప్రతిఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహనతో ఉండాలని పట్టణ ఎస్సై జీజే ప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక ఛాంబర్స్ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహనా కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రసాద్ మాట్లాడుతూ మొబైల్‌లో తెలియని యాప్‌లు వస్తే పూర్తి వివరాలు తెలియకుండా ఓపెన్ చేయకూడదని అన్నారు. చిన్న పిల్లలకు ఫోన్లు ఇవ్వడం వల్ల వారు తెలియక ఫోన్‌లో ఏదో ఒకటి క్లిక్ చేస్తుంటారని తద్వారా అనేక సార్లు నగదు పోయిన సందర్భాలు ఉన్నాయన్నారు. పిల్లలకు ఫోన్లు ఇవ్వకుండా జాగ్రత్త పడాలన్నారు. సమావేశంలో ఏఎస్సై మార్‌లింగం, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

తృటిలో తప్పిన ప్రమాదం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో జరిగిన ఓ ప్రమాదం నుంచి ఓ యువతి తృటిలో తప్పించుకుంది. గురువారం సుబ్బారాయుడు గుడి సెంటర్ నుంచి బుధవారపు వీధికి వెళ్లే మార్గ మధ్యలో ఉన్న కరణాల వీధిలో ఓ ప్రైవేటు ట్యూషన్ సెంటర్ ఉంది. ట్యూషన్ సెంటర్ వదిలిన అనంతరం విద్యార్థినులు తమ సైకిళ్లను తీసుకుని ఇంటికి వెళ్తున్నారు. ఇంతలో ఒక అమ్మాయి తన స్నేహితురాలి కోసం రోడ్డుపై నిలబడి ఉండగా వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఆ అమ్మాయి పట్టుకున్న సైకిల్ పూర్తిగా దెబ్బతింది. అదే అమ్మాయి సైకిల్‌పై కూర్చుని ఉంటే పెను ప్రమాదం జరిగేదని స్థానికులు, అక్కడున్న విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. ఈ సంఘటన అంతా అక్కడున్న సీసీ కెమెరాలో రికార్డు కావడం వల్ల విషయం వెలుగులోకి వచ్చింది.

అంతర్గత రహదారులు అధ్వానం

ఇబ్బందులుపడుతున్న వాహనదారులు

కాళ్ల: మండలంలో రాష్ట్ర రహదారితో పాటు అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. కొద్దిపాటి వర్షాలకే నీరు నిలబడి ప్రయాణం కష్టంగా మారుతుంది. కొన్ని రహదారులు భారీ గోతుల ఏర్పడడం తో వర్షపు నీరు నిలబడి చెరువులను తలపిస్తున్నాయి. ప్రధానంగా మండలంలో శివారు గ్రామాలైన పల్లెపాలెం నుండి ఎస్సీ బోస్ కాలనీ గ్రామానికి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి గోతులు ఏర్పడి ఛిద్రంగా మారింది. ఆక్వా చెరువులు విస్తరించడంతో నిత్యం భారీ వాహనాలు తిరుగుతూ ఉంటాయి. దీంతో రహదారులు అధ్వానంగా మారాయి. ఆ రహదారి వెంట ప్రయాణం అంటేనే ప్రయాణికులు, స్థానికులు భయపడుతున్నారు. గోతుల వల్ల వాహనాలు రిపేర్లకు వస్తున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి రహదారిని కనీసం మరమ్మత్తులను చేయాలని కోరుతున్నారు.

ప్రతిరోడ్డూ గోతులమయమే

మండలకేంద్రమైన కాళ్ల నుండి లంక రోడ్డు, అదేవిధంగా కోలనపల్లి మీదుగా ఆకివీడు వెళ్లే రహదారి గోతులమయమైంది. కోలన్నపల్లి రహదారి కొంతమేర మరమ్మతులు చేసినప్పటికీ మిగిలిన కొంత భాగాన్ని వదిలేయడంతో భారీ గోతులు ఏర్పడ్డాయి. దీంతో కొద్దిపాటి వర్షానికి భారీ గోతుల్లో వర్షపు నీరు నిలబడి చెరువులను తలపిస్తున్నాయి. గోతులు ఎక్కడ ఉన్నాయో తెలియక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో గోతుల్లో పడి ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. అంతేకాకుండా కాళ్ల లంక రోడ్డు గోతులతో బురదమయంగా మారింది. లంక రోడ్లో జగనన్న కాలనీ, ఆక్వా చెరువులు విస్తరించి ఉన్నాయి. నిత్యం ప్రయాణికులు, వాహనదారులు రైతులు ఆ రహదారి వెంటే వెళ్తుంటారు. ఈ రహదారుల ప్రయాణం జారుడుబల్ల మాదిరిగా మారిందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీకి వెళ్లాలంటే ఇబ్బందులుపడాల్సి వస్తుందని కాలనీవాసులు చెబుతున్నారు. వర్షాకాలం కావడంతో మరింత ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. అంతేకాకుండా కోపల్లె నుంచి వేంపాడు మీదుగా భీమవరం వెళ్లే రహదారి కూడా మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి గోతులమయమైన రహదారులను నిర్మించాలని కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న కోలనపల్లి రహదారి



బురదమయంగా ఉన్న కాళ్లలంక రహదారి

క్లుప్తంగా

ముగిసిన అమ్మవార్ల జాతర



ప్రత్యేకాలంకరణలో దండుమారమ్మ, పేట మారమ్మ

నరసాపురం రూరల్: మండలంలోని తూర్పుతాళ్లు గ్రామదేవత దండు మారెమ్మ, పేటమారమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అఖండ అన్న సమారాధన, అమ్మవారిని సముద్ర స్నానానికి తీసుకువెళ్లడం , ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన నిప్పుల గుండం తదితర కార్యక్రమాలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా రుద్రహోమం



రుద్ర హోమంలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో మాస శివ రాత్రి సందర్భంగా రుద్రహోమం నిర్వహించారు. గురువారం ఉదయం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభిషేక పండిట్ భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో తొమ్మిది మంది దంపతులు రుద్రహోమంలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం భక్తులకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం 6 గంటలకు లీలా కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ పసుపులేటి వాసు తదితరులు పాల్గొన్నారు.

జుత్తిగ సోమేశ్వరునికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో శ్రీ సోమేశ్వర స్వామి

పెనుమంట్ర: మండలంలోని జుత్తిగ గ్రామంలో ఉన్న శ్రీ ఉమ వాసుకి రవి సోమేశ్వర స్వామి ఆలయంలో గురువారం మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ సోమేశ్వర స్వామికి మహా రుద్రాభిషేకాలు, బిల్వర్చన పూజలు చేశారు. ముందుగా మహాగణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతి దేవికి కుంకుమార్చనలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు గణేష్ శర్మ, రామకృష్ణ శర్మ, వాసు శర్మ ఆధ్వర్యంలో భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం స్వామి వారికి గ్రామోత్సవం చేశారు.

30న సంచార జాతుల స్వాతంత్ర్య దినోత్సవం



పెండ్ర వీరన్న

నరసాపురం రూరల్: సంచార జాతుల స్వాతంత్ర్య దినోత్సవాలను అన్ని జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలని ఆ సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు పెండ్ర వీరన్న పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 73వ స్వాతంత్ర్య దినోత్సవాలను రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నిర్వహిస్తామని ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న తెలిపారు. 1952 ఆగస్టు 31న భారతదేశవ్యాప్తంగా నేరస్తులుగా ఉన్న సంచార జాతుల వారిని విముక్త జాతులుగా గుర్తిస్తూ చట్టం తీసుకు వచ్చారని పేర్కొన్నారు. ఈ అంశాన్ని పురస్కరించుకుని సంచార జాతుల సంఘం ఆధ్వర్యంలో గత 9 సంవత్సరాలుగా సంచారజాతుల స్వాతంత్ర్య వేడుకలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ నెల 30న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఉభయగోదావరి జిల్లాకు చెందిన సభను ఏర్పాటు చేసినట్లు వీరన్న స్పష్టం చేశారు.

ఆశ కార్యకర్తలకు కనీస వేతనం ఇవ్వాలి

భీమవరం: నిరంతరం ప్రజలకు సేవ చేస్తున్న ఆశ కార్యకర్తలకు నెలకు రూ.26,000 కనీస వేతనం ఇవ్వాలని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా విస్తృత సమావేశం సీహెచ్ లక్ష్మి అధ్యక్షతన స్థానిక సీఐటీయూ ఆఫీసులో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేసిన ఆశ కార్యకర్తలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 30న తణుకులో నిర్వహించే ఆశ వర్కర్స్ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి. వాసుదేవరావు, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు డి.జ్యోతి, ఎల్.కుమారి, పి.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.